క్లుప్తంగా

పోషకాహార మాసోత్సవాలు



పంచదార్లలో ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

రాంబిల్లి: పంచదార్ల, నారాయణపురం గ్రామాల్లో మంగళవారం పోషకాహార మాసోత్సవాలు నిర్వహించారు. విజయవాహిని చారిటబుల్ ట్రస్టు, టాటా ట్రస్టు, ఏషియన్ పేయింట్స్ వారి సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా ర్యాలీలు నిర్వహించి పోషకాహార ప్రాధాన్యత, విశిష్టతలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అమ్మాజీ, వైఎస్సార్‌సీపీ నాయకుడు రాజు, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ, వైద్య సిబ్బంది, పోషణ సఖిలు పాల్గొన్నారు.

ఉత్సవ కమిటీ చైర్మన్‌గా రాము



వెంకట సత్య రాము

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం హరిపాలెం-అందలాపల్లి ఉత్సవ కమిటీ చైర్మన్‌గా బుద్ధ వెంకట సత్య రాము నియమితులయ్యారు. జిల్లాలో పేరొందిన భగీరథమ్మ వారి ఉత్సవాలు నిర్వహించడంతో పాటు, ఏడాది కాలం గ్రామంలో వివిధ అమ్మవారి పండగలను, ఉత్సవాలను ఈ కమిటీ పర్యవేక్షించనుంది. కార్యదర్శిగా కాండ్రేగుల అప్పారావు, కోశాధికారిగా సూరిశెట్టి వెంకట గాంధీ అప్పారావు, సభ్యులుగా కాండ్రేగుల జగదీష్, మోహనరావు, కాండ్రేగుల లక్ష్మీనారాయణ, శరగడం భాగ్యరాజ్, బీరా శ్రీనివాసరావు, పచ్చారి కొండబాబు, పాలమరశెట్టి ఈశ్వరరావులను ఎన్నుకున్నారు.

నిలిచిన తాగునీటి సరఫరా



పైప్‌లైన్‌కు మరమ్మతు పనులు

రాంబిల్లి: దిమిలి పరిసర గ్రామాలకు రెండు రోజులుగా తాగునీరు సరఫరా నిలిచిపోయింది. దీంతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. కట్టుపాలెం వద్ద పైప్‌లైన్‌కు రంధ్రం పడి తాగు నీరు వృథాగా పోతుండటంతో మంగళవారం మరమ్మతు పనులు చేపట్టారు. అయితే నీరు బాగా లీకై పోతుండంతో మరమ్మతు పనులు పూర్తి కాలేదు. సోమలింగపాలెం వద్దనున్న బోర్ల నుంచి మోటార్ల సాయంతో నీరును తోడి పైప్‌లైన్ ద్వారా దిమిలి, కట్టుబోలు, మురకాడ, రాజారాయుడుపాలెం, మర్రిపాలెం, కుమ్మరాపల్లి, రజాల గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు.

ఉత్తమ గురువుకు సత్కారం



రమేష్‌ను సత్కరిస్తున్న సిబ్బంది, విద్యార్థులు

ఎస్.రాయవరం: అంకితభావంతో పని చేసే ఉపాధ్యాయులకు సమాజంలో గౌరవం, గుర్తింపు లభిస్తాయని దార్లపూడి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణశ్రీ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం నాడు ఉత్తమ ఉపాధ్యాయునిగా పురస్కారం పొందిన గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు గారా రమేష్‌ను పాఠశాలలో మంగళవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జాన్, శేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

చవితి ఉత్సవాలకు ఏర్పాట్లు



కనకమహాలక్ష్మి వీధిలో వినాయక చలువ పందిరి

కశింకోట: వినాయక చవితి ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు కశింకోటలో యువకులు ఏర్పాట్లు చేస్తున్నారు. వీధుల్లో చలువ పందిళ్ల, ముఖ ద్వార సెట్టింగ్‌ల ఏర్పాటులో బిజీగా ఉన్నారు. ఈ వేదికలపై ఈ నెల 18న తొలి దైవం వినాయకుని విగ్రహాలను కొలువుదీర్చి, నవరాత్రి ఉత్సవాలు జరిపేందుకు సన్నద్ధమవుతున్నారు.

ప్రతి గడపలో సంక్షేమం.. ప్రతి వీధిలో అభివృద్ధి



దార్లపూడిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం: నియోజకవర్గంలో ఏ గడపకు వెళ్లినా జగనన్న సంక్షేమ పథకాల ఫలాలు, ఏ వీధిలో చూసినా అభివృద్ధి కార్యక్రమాలు దర్శనమిస్తున్నాయని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. దార్లపూడి గ్రామంలో రెండవ రోజై మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? ఆటంకాలేమైనా ఉన్నాయా? అని ఆరా తీశారు.

మహిళలు, లబ్ధిదారులు సమాధానమిస్తూ సీఎం జగన్‌బాబు అందించే ప్రతి సంక్షేమ ఫలం నేరుగా తమ ఇంటికి చేరుతోందని ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఏ అవసరమున్నా నాయకులు, అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగేవారిమని, ప్రస్తుతం ప్రభుత్వం అందిస్తున్న ప్రతి పథకం గురించి తెలిపి, మా అర్హతల మేరకు దగ్గరుండి మరీ వలంటీర్లు దరఖాస్తు చేయిస్తున్నారని పేర్కొన్నారు. గ్రామస్తుల సమాధానంతో ఎమ్మెల్యే మరింత ఉత్సాహం కనబరచి అధికారులు, కార్యకర్తలతో కలిసి మరిన్ని ఇళ్లకు వెళ్లారు. కుటుంబాల వారీగా అందిన సంక్షేమ లబ్ధిని గణాంకాలతో సహా వివరించారు. స్థానిక సమస్యలను తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారుల్ని ఆదేశించారు. ప్రజల సంక్షేమానికి, రాష్ట్ర అభివృద్ధికి ఇంతగా కృషి చేస్తున్న సీఎం జగన్ మోహన్‌రెడ్డిని రానున్న ఎన్నికల్లో మళ్లీ గెలిపించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కాకర దేవి, వైఎస్సార్‌సీపీ జిల్లా కమిటీ కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, మెంబర్ కశింకోట నీలేంద్రరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పోలిశెట్టి సతీష్, శ్రీను, అద్దేపల్లి నూకు నాయుడు, కోన బాబూరావు, మల్లేష్, కోన రామారావు, పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అర్హులందరికీ పింఛన్లు



అరబుపాలెంలో పింఛన్ అందజేస్తున్న సర్పంచ్ శ్రీనివాసరావు

మునగపాక: అర్హులైన ప్రతీ ఒక్కరికీ పింఛన్‌లు అందిస్తామని అరబుపాలెం సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు అన్నారు. నూతనంగా మంజూరైన పింఛన్లను మంగళవారం ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను శత శాతం అమలు చేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ శరగడం జగదీష్, వలంటీర్లు కాండ్రేగుల హరి, బొడ్డేడ కనక, పల్లి జ్యోతి, కోరిబిల్లి లీలా కృష్ణ, ఆడారి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

తప్పుల్లేని ఓటరు జాబితా సిద్ధం

- అనకాపల్లి డివిజన్ ఆర్డీవో చిన్నికృష్ణ



మాట్లాడుతున్న అనకాపల్లి డివిజన్ ఆర్డీవో చిన్నికృష్ణ

సబ్బవరం: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా పరిశీలన పూర్తి చేశామని, తప్పులు లేని పరిపూర్ణమైన ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్టు అనకాపల్లి డివిజన్ ఆర్డీవో చిన్నికృష్ణ తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన మంగళవారం విలేకర్లతో మాట్లాడారు. అక్టోబర్ 17వ తేదీ నాటికి డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తామన్నారు. అనంతరం నెల రోజుల పాటు అభ్యంతరాలు స్వీకరించి సరి చేస్తామని చెప్పారు. జనవరి 5న తుది జాబితా ప్రదర్శిస్తామన్నారు. ఇంటింటికీ వెళ్లి బీఎల్‌వోలు నిర్వహించిన సర్వేలో మరణించిన, ఇల్లు మారిన, డూప్లికేట్ ఓటర్లను గుర్తించామన్నారు. ఇకపై జీరో డోర్ నంబర్లు కనిపించకుండా సమగ్రంగా సర్వే నిర్వహించినట్టు వివరించారు. ఇప్పటి వరకు జనవరి 1న మాత్రమే ఓటరు నమోదు ప్రక్రియ జరిగేదని, ఇకపై జనవరి 1తో పాటు ఏప్రిల్ 1, జూలై 1, అక్టోబర్ 1న కూడా నమోదు కార్యక్రమం చేపడతామన్నారు. 17 నుంచి 18 సంవత్సరాల్లోపు వయస్సు కలిగిన యువతీ, యువకులు భావి ఓటర్లుగా నమోదు చేయించుకుంటే 18 సంవత్సరాలు నిండిన తరువాత ఆటోమేటిక్‌గా ఓటు హక్కు పొందవచ్చునన్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న జగనన్న చెబుతాం కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్టు తెలిపారు. వచ్చిన ప్రతి అర్జీని వీఆర్వో స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్ర స్థాయిలో విచారణ చేపట్టి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. అనకాపల్లి డివిజన్ పరిధిలో మొదటి దశలో 93 గ్రామాల్లో సమగ్ర రీసర్వే పూర్తి చేశామన్నారు. రెండో దశలో 123 గ్రామాలకు ఇప్పటికే 90 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందన్నారు. మూడో విడతలో మరో 68 గ్రామాల్లో రీసర్వే ప్రారంభిస్తున్నట్టు ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక విగ్రహాల పంపిణీ



తేగాడ ఆదర్శ పాఠశాలలో మట్టి వినాయక విగ్రహాలను అందిస్తున్న స్పందించే హృదయం ప్రతినిధులు

కశింకోట: పర్యావరణ హిత వినాయక చవితి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ సహకరించాలని తేగాడలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఐ.మార్తా తిలకం కోరారు. స్పందించే హృదయం స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు మట్టి వినాయకుడు-పర్యావరణ పరిరక్షణ అంశంపై అవగాహన కల్పిస్తూ, కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం సుమారు 300 మంది విద్యార్థులకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మట్టి వినాయక ప్రతిమలను పూజించి, జలాశయాల్లో నిమజ్జనం చేయడం వల్ల సారవంతమైన మట్టి నీటి ప్రవాహంతోపాటు కొట్టుకుపోయి పంట పొలాల్లోకి చేరుతుందన్నారు. దీంతో పంటలు బాగా పండటంతో పాటు, నీరు కలుషితం కాదన్నారు. సంస్థ సభ్యుడు కాకి సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని పాఠశాలల్లో విద్యార్థులకు అవగాహన కల్పించి, మట్టి వినాయక ప్రతిమలను ఉచితంగా అందిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. విజేతలైన బి.రేవతి, ఎస్.హరీష్‌రాజ్, ఎ.హేమలతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డి.లక్ష్మి, ఉపాధ్యాయులు ఎస్.రాజేశ్వరి, ఆర్.సింహాచలం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కొత్త అమావాస్య వేడుకలు ఘనంగా నిర్వహిస్తాం

- నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ



మాట్లాడుతున్న కొణతాల మురళీకృష్ణ

అనకాపల్లిటౌన్: కొత్త అమావాస్య వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటి నుంచే అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు నూకాంబిక ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ తెలిపారు. గవరపాలెం అమ్మవారి ఆలయ ఆవరణలో మంగళవారం నూతన పాలకవర్గం, కమిటీలతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే ఏడాది మార్చి నెలలో వచ్చే కొత్త అమావాస్య జాతర, ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను ఇప్పటి నుంచే చేయాలని ఆలయ అధికారులకు సూచించారు. వచ్చే నెల అక్టోబర్లో జరిగే శరన్నవరాత్రి వేడుకల్లో రోజుకో అవతారంలో అమ్మవారిని అలంకరించి, ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఆలయంలో తొమ్మిది రోజులూ ప్రత్యేక పూజలతోపాటు, సామూహిక కుంకుమార్చనలు జరుగుతాయన్నారు. కొత్త అమావాస్య జాతరకు 45 రోజుల ముందు మాలధారణ భక్తులు అమ్మవారి దీక్షలు బూని ఉదయం, సాయంత్రం అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోందన్నారు. దీక్షలు భూనిన భక్తులు అమ్మవారికి నిర్వహించే భారీ అంబలం పూజకు రూ.10 లక్షలు ఖర్చు చేస్తారన్నారు. అమ్మవారి మాలధారణకమిటీ సభ్యుడు ఆదిబాబు అమావాస్య యూత్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో ఏడాది పొడవునా రూ.లక్షతో అమ్మవారి అమావాస్య పూజలో వెయ్యిమందికి అన్న ప్రసాదాన్ని అందించడం అభినందనీయమన్నారు. అమ్మవారి మూలవిరాట్ దేవాలయం పునర్నిర్మాణంలో ఉందని, తాత్కాలికంగా ఏర్పాటు చేసిన బాలాలయంలో భజనలు నిరాటంకంగా కొనసాగించాలని భజనమండలి సభ్యులను ఆయన కోరారు. నిర్వాహకులు పాలిమేర శ్రీను, కాండ్రేగుల సోమేష్, పాలమరశెట్టి కుమార్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు పీలా లక్ష్మీశ్రీనివాస్, బుద్ధ నర్సింగరాజు, పాలకవర్గ సభ్యులు కొండూరు రవీంద్రనాథ్, మల్లవరపు ఈశ్వరరావు, వై.వాసు పాల్గొన్నారు.

15న అయ్యప్పకు పంచామృతాభిషేకాలు

మునగపాక: మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో ఈ నెల 15న పంచామృతాభిషేకాలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఉత్తర ఫల్గుణ నక్షత్రం సందర్భంగా ఆ రోజు ఉదయం 6 గంటల నుంచి 8 గంటల వరకు మూలవిరాట్‌కు ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారి తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

రేపటి నుంచి స్కూల్ గేమ్స్

యలమంచిలి: ఈ నెల 14 నుంచి యలమంచిలి కొత్తపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు యలమంచిలి నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ కో ఆర్డినేటర్ సీహెచ్ వెంకటరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల క్రీడా పోటీలు మండల, జిల్లా స్థాయిలో నిర్వహిస్తామన్నారు. అండర్ 14, 17 విభాగాల్లో బాల బాలికల క్రీడలు వేర్వేరుగా నిర్వహించి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికలు జరుగుతాయన్నారు. మండల, జిల్లా స్థాయిలో బ్యాడ్మింటన్, బాల్ బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, టెన్నీకాయిట్, త్రోబాల్, వాలీబాల్, యోగా, అథ్లెటిక్స్‌లలో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అర్హత ఫామ్స్‌తో రావాల్సిందిగా సూచించారు.

కొత్త పింఛన్ల పంపిణీ



తాళ్లపాలెం కొత్త పింఛన్లు అందిస్తున్న గణేష్

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం పంచాయతీ పరిధిలో కొత్తగా 9 మందికి మంజూరైన పింఛన్లను మంగళవారం అందజేశారు. వైఎస్సార్ సీపీ యువజన విభాగం జిల్లా కార్య నిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్ చేతుల మీదుగా వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ పాలన సాగుతోందన్నారు. అర్హులైన వారు ఎప్పుడు దరఖాస్తు చేసుకున్నా, సంక్షేమ లబ్ధి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

8 మందికి కంటి ఆపరేషన్లు



ఆపరేషన్ చేయించుకున్న రోగులతో క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం ఏఎంఏవీఎం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మంది రోగులకు ఐవోఎల్ ఆపరేషన్లు ఉచితంగా చేసినట్లు ఆస్పత్రి అధ్యక్షుడు బి.కె.నాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం 44 మంది రోగులకు కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులను మూడు రోజులు ఆస్పత్రిలో ఉంచి, వారికి కావలసిన మందులు, భోజనం ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రోటరీ నేత్ర వైద్యసహాయకురాలు పి.దేవి, రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



జగనన్న ఆరోగ్య సురక్షపై వైద్య సిబ్బందితో సమావేశం

పాయకరావుపేట: ఈ నెల 30 నుంచి ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాలయ ఆవరణలోని స్త్రీ శక్తి భవన్‌లో ఎంపీడీవో ఎ.సాంబశివరావు ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని 24 గ్రామాల్లో ఈ నెల 30 నుంచి వైద్య సిబ్బంది పర్యటించి, ప్రజల ఆరోగ్య సంరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తల్ని వివరించేలా, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. మండలంలోని పాయకరావుపేట, మంగవరం, శ్రీరాంపురం పీహెచ్‌సీల వైద్యాధికారులు హాజరై, సిబ్బందికి తగు సూచనలు, సలహాలు అందించారు.

పార్టీలో కష్టపడి పనిచేసేవారికి గుర్తింపు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్



ప్రసాద్‌ను సత్కరిస్తున్న రమణ అప్పారావు

మునగపాక: పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు ఉంటుందని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. పార్టీ అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సూరిశెట్టి రమణఅప్పారావు మంగళవారం ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. తన నియామకం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ 2024లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయకేతనం ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. పార్టీలో మొదటి నుంచి కష్టపడి పనిచేసేవారికి తగిన ప్రాధాన్యత ఉంటుందన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంతో పాటు జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం వల్ల ప్రజలకు జరిగిన, జరగనున్న మేలును వివరించాలన్నారు. పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ప్రతిపక్షాల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి విల్లూరి శివసూరి, బీఎస్ఎన్ఎల్ కమిటీ సభ్యుడు పొలమరశెట్టి సన్యాసినాయుడు, పార్టీ నేతలు ఏడువాకల నారాయణరావు, సత్యనారాయణ మాష్టారు, కె.భాస్కరరావు, పిల్లా కోటేశ్వరరావు, ఆలం రమణ, నాగులాపల్లి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను వినియోగించుకోండి



తిమ్మరాజుపేటలో మట్టిని సేకరిస్తున్న బీజేపీ శ్రేణులు

మునగపాక: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు యల్లపు రాజేశ్వరరావు కోరారు. నా దేశం-నా మట్టి కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని తిమ్మరాజుపేటలో మట్టి సేకరణ జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ నాయకత్వంలో దేశం అభివృద్ధి చెందుతోందన్నారు. ప్రపంచ దేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నేతలు దొడ్డి వెంకట సత్యనారాయణ, మళ్ల కాలేశ్వరరావు, బుద్ధ విశ్వనాథం, మళ్ల మల్లయ్యనాయుడు, మళ్ల రామజోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

పెదపాడులో పోషకాహార మాసోత్సవ ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న సిబ్బంది, స్వచ్ఛంద సంస్థ సభ్యులు, స్థానికులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పెదపాడులో విజయ వాహిని ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ పోషకాహార మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. టాటా ట్రస్ట్, ఏసియన్ పెయింట్స్ సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీలో ఆరోగ్య సమస్యలు రాకుండా ఉండాలంటే తీసుకోవాల్సిన పోషకాహారంపై అవగాహన కల్పించారు. న్యూట్రీ గార్డెన్ కోసం వీసీఎఫ్ బృందం విత్తనాలు అందించింది. వీసీఎఫ్ బ్లాక్ కోఆర్డినేటర్ హారిక, పోషణ సఖి గుండ్లు ఉషారాణి, వరలక్ష్మి, పద్మ, ఎంపీపీ భర్త కోన బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

అవగాహనతోనే హెచ్ఐవీకి దూరం



అవగాహన కల్పిస్తున్న ఐటీసీటీ సిబ్బంది

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని కొండకర్ల, తిమ్మరాజుపేటలో ఎంపిక చేసిన వారికి హెచ్ఐవీ పరీక్షలు మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్ వర్కర్స్ ఆధ్వర్యంలో ఈ పరీక్షలు నిర్వహించారు. ఐసీటీసీ మొబైల్ కౌన్సిలర్ అర్జున్ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు హెచ్ఐవీ పరీక్షలు చేయించుకునేందుకు ముందుకు రావాలన్నారు. అవగాహనతోనే హెచ్ఐవీకి దూరంగా ఉండవచ్చన్నారు. 44 మందికి హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కిశోర్ కుమార్, లింక్ వర్కర్ ఎం.సరస్వతి, కె.శివ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణులకు అండగా ఫ్యామిలీ డాక్టర్



తగరంపూడి పీహెచ్‌సీలో వైద్యులతో మాట్లాడుతున్న దాడి రత్నాకర్

అనకాపల్లి రూరల్: ఫ్యామిలీ డాక్టర్ విధానం దేశంలో ఎక్కడా లేదని, కేవలం మన రాష్ట్రంలోనే అమలవుతోందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనకాపల్లి పార్లమెంటు పరిశీలకుడు దాడి రత్నాకర్ అన్నారు. మంగళవారం తగరంపూడి పీహెచ్‌సీని ఆయన పరిశీలించారు. వైద్యులు, సిబ్బంది, రోగులతో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వైద్యం కోసం కోట్లాది రూపాయల నిధులను ఖర్చు చేస్తోందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రజలకు మెరుగైన, అత్యాధునిక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకొచ్చేలా ఎన్నో సంస్కరణలు అమల్లోకి తెచ్చిన ఘనత సీఎం జగన్ మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. ప్రభుత్వ లక్ష్యం మేరకు ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు.

నల్లమారమ్మ ఆలయంలో రత్నాకర్ పూజలు

మండలంలోని వెంకుపాలెం నల్లమారమ్మ ఆలయంలో వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకుడు దాడి రత్నాకర్ మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ సర్పంచ్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం శాలువాతో దాడి సత్కరించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ సందర్భంగా రత్నాకర్ మాట్లాడుతూ తనను కొలిచే భక్తుల పట్ల అమ్మవారి చల్లని కరుణ ప్రసరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రాపేటి నాగేశ్వరరావు, ఎంపీటీసీ రాపేటి వెంకటేష్, బొడ్డపాటి చిన రాజారావు, దాడి గణేష్, బుద్ధ శివనాయుడు, మళ్ల రమణబాబు, రాపేటి తాతారావు, బుద్ధ చిరంజీవి, బుద్ధ శేఖర్, రాపేటి రామకృష్ణ, ఆడారి నరసింగరావు, వేగి కోటి తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయ నృత్యాలకు ప్రతీక భరత నాట్యం



భరత నాట్యం చేసిన చిన్నారులతో ఆలయ కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: సంప్రదాయ నృత్యాలకు భరత నాట్యం ప్రతీక అని గౌరీ పంచాయతన దేవాలయ అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసిరావు అన్నారు. శ్రావణ మాస ఆఖరి మంగళవారం సందర్భంగా ఆలయ ఆవరణలో జరిగిన 40 మంది చిన్నారులతో భరత నాట్య ప్రదర్శన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. చిన్నప్పటి నుంచే పిల్లలకు శాస్త్రీయ నృత్యంలో తర్ఫీదునిచ్చేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఆలయంలోని గౌరీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. చిన్నారులు చేసిన భరతనాట్యం ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, సభ్యులు ఏఎల్ఆర్ నర్సింగరావు, పెంటకోట ఉమామహేశ్వరరావు, పెంటకోట బాలకృష్ణ, అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, ఆలయ సిబ్బంది ఎం.శ్రీనివాసరావు పాల్గొన్నారు.